క్లుప్తంగా

దంచికొట్టిన వాన

చల్లబడిన వాతావరణం..
ఉక్కపోత నుంచి ఉపశమనం



ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపట్నం: ఏకధాటిగా వర్షం దంచికొట్టింది. విరామం లేకుండా సుమారు నాలుగు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఇబ్రహీంపట్నం మండల ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లయింది. నిన్నమొన్నటి వరకు పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన జనానికి.. ఈ వాన చల్లదనాన్ని ఇచ్చింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన వాన.. రాత్రి 8 గంటల వరకు కురిసింది. దీంతో ఇబ్రహీంపట్నంలో 48.5 మి.మి, ఎలిమినేడులో 51.3, కొంగరకలాన్‌లో 35.8 మి.మి వర్షపాతం నమోదయింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీడని వానతో రోడ్లపై జన సంచారం నిలిచిపోయింది.

ఛత్రపతి శివాజీ వర్ధంతి



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సూర్యవంశి ఆరెకటిక సంఘం, బీజేపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. పట్టణంలోని శివాజిపార్కులోని ఆయన విగ్రహానికి సంఘం అధ్యక్షుడు సుభాష్, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, సంఘం నాయకులు యాదీలాల్, శంకర్, నిరంజన్, బీజేపీ నాయకులు లక్ష్మణ్, రాజు, రవిరాథోడ్, అశోక్, ఎర్రవోలు రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: బీసీల అభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 15న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'మన ఆలోచన సాధన సమితి' ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎస్ కోర్ కమిటీ సభ్యుడు దొంత ఆనందం తెలిపారు. గురువారం పట్టణంలోని రాజీవ్ కూడలి వద్ద సభ పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ.. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం సమితిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభకు బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల జగన్, నాయకులు గజ్జి శ్రీనివాస్‌గౌడ్, పెద్దఊర బ్రహ్మం, విశ్వేశ్వర్, హరికృష్ణ, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మంత్రి భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రితో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఆమనగల్లు పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్, చంద్రునాయక్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

బిల్లు ఆమోదంతో పేద ముస్లింలకు లబ్ధి

తలకొండపల్లి: పార్లమెంటులో వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదం పొందడంతో పేద ముస్లింలకు లబ్ధి చేకూరనుందని బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన చంద్రధనలో మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా గతంలో ధనిక ముస్లింలకే మేలు జరిగేదని, ప్రస్తుతం పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ప్రయోజనం చేకూరనుందన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- సన్నబియ్యం పంపిణీతో ఆనందం వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు
- కాంగ్రెస్ నాయకులు
- పలు గ్రామాల్లో బియ్యం పంపిణీ ప్రారంభం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మంచాల: ఆగాపల్లి రేషన్ దుకాణం వద్ద సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సన్నబియ్యం పంపిణీతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలం ఆగాపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ సర్కార్ దశల వారీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్పన, ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లావణ్య, మండల నాయకులు రమాకాంత్‌రెడ్డి, రాజు, బాలయ్య, జంగయ్య మార సురేష్, బాల శివుడుగౌడ్, అజయ్ కుమార్, అనిల్‌కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్ల వార్డులోని రేషన్ దుకాణంలో ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తుండటంతో వారిలో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు.

సురంగల్‌లో..

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకటేశ్, చంద్రమౌళి, రాంరెడ్డి, పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే.. అభివృద్ధి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అజాంఅలీతో కలిసి ఆయన లబ్ధిదారులకు సన్నబియ్యం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఉన్నారు.



షాబాద్: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు



కేశంపేట: లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్న నాయకులు

ఆదిబట్లకు 'అచీవర్స్' అవార్డు

కమిషనర్‌కు అందజేసిన సీడీఎంఏ శ్రీదేవి



అవార్డు అందుకుంటున్న కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను వసూలులో గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో ముందు వరుసలో ఉన్నామని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. 2023- 24లో 91 శాతం, 2024- 25లో 86 శాతం ఆస్తి పన్ను వసూలులో మున్సిపాలిటీ ముందు వరుసలో ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి అచీవర్స్ అవార్డు వరించింది. ఈ మేరకు గురువారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీడీఎంఏ శ్రీదేవి చేతుల మీదుగా కమిషనర్ అవార్డుతో పాటు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో మరింత ముందుకు సాగుతామని చెప్పారు.

అభివృద్ధి ఓర్వలేకే.. అసత్య ప్రచారాలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

కడ్తాల్: దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వ లేకపోతున్నారని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ.. ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యా నాయక్‌లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు ప్రభుత్వం.. రైతులకు రుణమాఫీ చేసిందని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి, రైతన్నకు దన్నుగా నిలిచిందన్నారు.

యువ వికాసంతో ఉపాధి

దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు, విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంట్‌కు పంపిన చరిత్ర సీఎం రేవంత్‌రెడ్డిదని ఆయన గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షలకు ఆరోగ్యశ్రీ తదితర పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. యువ వికాసంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఫోర్త్‌సిటీ నిర్మాణం చేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడం తగదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ.. దక్షిణ తెలంగాణ అభివృద్ధి వైపు చూడలేదని, ఈ రోజు జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు రాజేశ్, అశోక్, రవి, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

బడుల బలోపేతానికి సహకరించాలి

ఎంపీడీఓ శ్రీకాంత్



పాఠశాలకు టీవీ అందజేస్తున్న దాత సుధాకర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని తలకొండపల్లి ఎంపీడీఓ శ్రీకాంత్ కోరారు. తలకొండపల్లి మండలం చీపునుంతల ప్రాథమిక పాఠశాలకు, గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎర్ర సుధాకర్ రెడ్డి రూ.1.50 లక్షల విలువైన బెంచీలు, ఎల్ఈడీ టీవీ, ఆట వస్తువులను ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంఈఓ చాంప్లానాయక్‌ల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం దాతను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ రఘుపతి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్, ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, అంజమ్మ, నాయుడు, గ్రామ కార్యదర్శి యాదగిరి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహ, నాయకులు బాలకుమార్, శ్రీశైలం, నర్సింహ, శేఖర్, చెన్నయ్య, యాదగిరి, అభినవ్, జంగయ్య, మల్లయ్య, బాలరాజు, నితిన్, విజయ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బడిబాట షురూ



బడిబాటలో ఎంఈఓ పాండురంగారెడ్డి

యాచారం: మండల పరిధి మంతన్‌గౌరెల్లి గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. 2025- 26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడమే లక్ష్యంగా బడిబాటను చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో మెరుగైన విద్య, ఉచిత పుస్తకాలు, నాణ్యమైన భోజనం అందుతుందని పేర్కొన్నారు. ప్రవేట్ బడుల్లో రూ.లక్షలు ఖర్చు చేసి, పిల్లలను చేర్పించే బదులు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లితండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీ మేనేజర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వెలుస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపాలిటీ మేనేజర్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ.. తట్టి అన్నారంలోని సర్వే నంబర్ 105లో ఎలాంటి అనుమతి లేకుండా షెడ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేశామని, అయినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పురపాలికలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్ల ప్రభాకర్, నాయకులు రవికుమార్, జగన్మోహన్‌రెడ్డి, ఎండీ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్

ఇబ్రహీంపట్నం: ఈ నెలలో నిర్వహించనున్న మహనీయుల జయంతులకు ఉత్సవ కమిటీలను ఎప్పుడు నియమిస్తారని కుల వివక్షత పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సామెల్ ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్‌లో బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణకు కమిటీలను వేయడంలో జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మిగతా జిల్లాల్లో కమిటీలు వేస్తున్నారని తెలిపారు. వెంటనే జిల్లాలోని సామాజిక, ప్రజాసంఘాల నాయకులను సంప్రదించి, ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక సాధనతో ఆనందమయం



విష్ణుసహస్రనామ యజ్ఞంలో భక్తులు

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించడానికి ఆధ్యాత్మిక సాధన ఎంతో అవసరమని శ్రీ రామదూత ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీ శివానందస్వామి అన్నారు. ప్రజలంతా తమవంతుగా భక్తి కార్యక్రమాల్లో పాల్గొని సమాజ శాంతికోసం కృషి చేయాలని సూచించారు. రామదూత ఆశ్రమంలో గురువారం 120వ విష్ణుసహస్రనామ యజ్ఞం, ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆశ్రమాలకు చెందిన శంకరానందగిరి స్వామి, లక్ష్మణానందగిరిస్వామి, నిర్వికల్పానందగిరిస్వామి, అమృతానందగిరిస్వామి, ఆత్మానందగిరి మాతాజీలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం శివానందస్వామి మాట్లాడుతూ.. దైవ కార్యక్రమాలు యజ్ఞయాగాదులు సమాజశాంతికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా సద్గురు నిత్యశుద్ధానందగిరిస్వామి జన్మదిన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ కమిటీ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, భక్తులు బికుమాండ్ల యాదయ్య, గౌరుయాదయ్య, దొంతు సత్యం, తల్లోజు వెంకటయ్య, గుర్రం భద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

మంచాల: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎండీ అజ్మత్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో విద్యాబోధన ఉందని పేర్కొన్నారు. బాల, బాలికలకు ప్రభుత్వం ద్వారా ఉపకారవేతనాలు వస్తాయని, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అదనపు సర్వీసులు తిప్పాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: బండలేమూర్, అజినతండాకు అదనంగా ఆర్టీసీ బస్సులను తిప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు బండలేమూర్ మాజీ సర్పంచ్‌లు పోచమోని కృష్ణ, పల్లె వీరయ్య, గడ్డం అంజయ్యలు మాట్లాడారు. ఇబ్రహీంపట్నం నుంచి బండలేమూర్, అజినతండాకు వచ్చే బస్సులు సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు. ఓ వైపు సమయ పాలన, మరోవైపు అరకొర సర్వీసులతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పల్లె ప్రజల రవాణాను దృష్టిలో ఉంచుకొని, ఇబ్రహీంపట్నం నుంచి సాయంత్రం 6.30 గంటలకు బండలేమూర్‌కు అదనంగా బస్సు వేయాలని, పట్నం నుంచి చెన్నారెడ్డిగూడ మీదుగా కుదాబక్షుపల్లికి వెళ్తున్న సర్వీసును.. బండలేమూర్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన మేనేజర్.. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నేతలు పేర్కొన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కుర్మసంఘం, వివిధ పార్టీల నాయకులు అన్నారు. కొమురయ్య జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అన్నదాతను ఆదుకోవాలి



ఆరుట్లతో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

మంచాల: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాదిగ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ డిమాడ్ చేశారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఎండిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. తద్వారా పంటలకు నీరు అందక అవి ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పొలాలను పరిశీలించి, నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కల్పించుకొని, వారికి తగిన న్యాయం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అదే విధంగా శివన్నగూడ- డిండి ప్రాజెక్ట్ పూర్తి చేసి, ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తగండిపల్లి నరేందర్ గౌడ్, నారాయణ రెడ్డి, ఐలయ్య, మల్లారెడ్డి, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పున్నం రాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది, గీత కార్మికులు

కడ్తాల్: మండల పరిధి ముద్విన్ గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కమిటీ ఎన్నికలను గురువారం సీఐ శివప్రసాద్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి నాగిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఎన్నికల్లో రెండు ప్యానళ్లకు సంబంధించి 10 మంది సభ్యులు పోటీ పడ్డారు. అధ్యక్షుడిగా పి.యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సి.పురుషోత్తం, సభ్యులుగా డి.యాదయ్య, జే.శ్రీను, బి.రాములు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో గీత కార్మికులు, స్థానిక నాయకులు కృష్ణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.